www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 21 సెప్టెంబరు 2024

5

పశ్చిమ గోదావరి



దోమల నిర్మూలనకు సహకరించాలి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - అత్తిలి

డ్రెయినేజీల్లో ప్లాస్టిక్, చెత్త ఉండడం వల్ల మురుగునీటి పారుదలకు అంతరాయం కలిగి దోమల పుట్టుకకు కారణం అవుతున్నాయని, దోమల నిర్మూలనకు ప్రజలకు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం అత్తిలిలో ఎంఎం స్కూల్ రోడ్డులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ డ్రెయినేజీ డస్ట్‌బిన్ కాదని, చెత్తను పంచాయతీ చెత్త సేకరణ వాహనానికి మాత్రమే అందజేయాలని తెలిపారు. అలాగే జ్వరాలతో బాధపడుతున్న ఇద్దరికి సూచనలు చేశారు. పంచాయతీ వారు నిర్వహిస్తున్న యాంటీ లార్వా ఆపరేషన్‌ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి గుడిమెట్ల వెంకటేశ్వరరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.మురళి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'మాల్స్'లో వెట్టిచాకిరీ..!

- రోజుకు పది నుంచి 12 గంటలు పని
- వేతనం నెలకు రూ.పది వేలలోపే
- ఉదయం నుంచి నిల్చొని ఉండాల్సిందే
- మాల్స్‌లో ఉద్యోగుల అవస్థలు వర్ణనాతీతం
- పట్టణాల్లో పెద్దఎత్తున మాల్స్ ప్రారంభం
- కొరవడిన అధికారుల తనిఖీలు..
- ఇష్టానుసారంగా యాజమాన్యాలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాల్లో షాపింగ్‌మాల్స్‌తోపాటు మార్ట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గడిచిన రెండు, మూడేళ్లలో ఏలూరులో అతిపెద్ద కార్పొరేట్ షాపింగ్‌మాల్స్, మార్ట్‌లు అనేకం ప్రారంభమయ్యాయి. మాల్స్‌లో పని చేసేందుకు స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున మహిళలు, యువకులు పని చేసేందుకు వస్తున్నారు. అత్యధికంగా మహిళలు ఉంటున్నారు. ప్రతి షాపింగ్‌మాల్, మార్ట్‌ల్లోనూ వందల సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తున్నారు. మాల్స్‌లో ఎక్కడా కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. మాల్స్ యాజమాన్యాలు పాటిస్తుందే చట్టం.. వారు అవలంభిస్తున్న నిబంధనలే శిరోధార్యం అన్నట్లు పరిస్థితి తయారైంది. అధికారుల తనిఖీలు పూర్తిగా కొరవడటంతో మాల్స్‌లో పని చేసే ఉద్యోగులు పడుతున్న అవస్థలు వర్ణానాతీతం. సరైన ఉపాధి లేకపోవడంతో అనేక మంది యువత మాల్స్‌లో పని చేసేందుకు వస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకుని మాల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా పని గంటల విషయంలో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతున్న పరిస్థితి ఉంది. మాల్స్‌లో పని చేసే ఉద్యోగులతో రోజుకు పది నుంచి 12 గంటలు పని చేయిస్తున్నారు. ఉదయం పది గంటలకు పని ప్రారంభిస్తే రాత్రి పది గంటల వరకూ ఉంచుతున్నారు. ఉద్యోగులకు వేతనాలు సైతం అత్యంత దారుణంగా ఇస్తున్నారు. రూ.ఏడు వేల నుంచి రూ.పది వేలలోపు జీతం తీసుకునే ఉద్యోగులే అధికంగా ఉంటున్నారు. మాల్స్‌లో పని చేసే ఉద్యోగులకు కార్మికచట్టాల నిబంధనలను అమలు చేయాల్సి ఉంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. జిల్లా కేంద్రం ఏలూరులో పరిస్థితి మరింత దారుణంగా ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

చట్టంలోని నిబంధనలు పట్టవా..!

కార్మిక చట్టాల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పని చేయించాలి. అంతకుమించి ఎక్కువ పని గంటలు చేస్తే ఓటి కింద రెట్టింపు వేతనం చెల్లించాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. ప్రతి ఉద్యోగినీ చేర్చుకునేటప్పుడు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలి. కనీస వేతనం చెల్లించాలి. పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలి. వెల్ఫేర్ ఫండ్ కట్టాలి. ప్రతియేటా బోనస్ చెల్లించాలి. ఐదేళ్లు దాటిన ఉద్యోగులకు గ్రాట్యూటీ ఇవ్వాలి. పురుష, మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. మహిళలకు ప్రసూతి సెలవులు అమలు చేయాలి. క్యాజువల్ లీవులు ఇవ్వాలి. మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించాలి. మాల్స్‌లో ఎక్కడా ఈ నిబంధనలు అమలు కావడం లేదు. కొన్ని మాల్స్ యాజమాన్యాలు పిఎఫ్, ఇఎస్ఐ వంటివి పది, ఇరవై మంది ఉద్యోగులకు అమలు చేసి వాటినే రికార్డుల్లో చూపిస్తున్నాయి. ఆదివారం, పండుగ దినాల్లోనూ పని చేయిస్తున్నా అదనంగా ఎటువంటి వేతనమూ ఇవ్వడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిలువకాళ్లపై నిలబడి పని చేస్తుండటంతో మోకాళ్ల నొప్పులతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు మాల్స్‌లో పని చేసే ఉద్యోగులను వెంటాడుతున్నాయి. కుటుంబ సభ్యులతో గడిపే సమయం లేకుండాపోతుంది. ఉద్యోగులు ఎవరైనా ప్రశ్నిస్తే తొలగించడంగాని, వారి నుంచి తీసుకున్న సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నానా ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. పెద్దఎత్తున లాభాలు కూడగట్టుకుంటున్న మాల్స్ యాజమాన్యాలు అక్కడ పని చేసే ఉద్యోగులను మాత్రం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అధికారుల తనిఖీలు లేకపోవడంతో మాల్స్‌లో నిబంధనలు అమలుకాని పరిస్థితి నెలకొంది. మాల్స్‌లో సీసీ కెమెరాలు ఉంటాయి. ఉద్యోగులు ఎన్ని గంటలకు వస్తున్నారు.. ఎన్ని గంటలకు వెళ్తున్నారో పక్కాగా తెలుస్తోంది. అయినప్పటికీ ఏఒక్కరూ పట్టించుకోని పరిస్థితి ఉంది. మాల్స్‌లో పని చేసే ఉద్యోగులు రోజురోజుకీ పెరుగుతుండటంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేకపోతే శ్రమ దోపిడీ మరింత పెరిగే పరిస్థితి ఉంది.



మాట్లాడుతున్న కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ

పిఎం విశ్వకర్మ యోజనను వినియోగించుకోవాలి

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ

ప్రజాశక్తి - నరసాపురం


పిఎం విశ్వకర్మ యోజనను చేతివృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. పిఎం విశ్వకర్మ యోజన పథకం ప్రారంభమై సంవత్సరమైన సందర్భంగా శుక్రవారం మండలంలోని పెదమైనవానిలంకలోని డిజిటల్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ పథకం అమలుకు పశ్చిమగోదావరి జిల్లాను మోడల్‌గా తీసుకున్నారన్నారు. దీని ద్వారా ఎవరి వృత్తిలో వారు నైపుణ్యాన్ని పెంచుకొని వృత్తిలో స్థిరపడేందుకు ఉపయోగపడుతుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ చేతివృత్తుల పునరుజ్జీవానికి ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. వివిధ రకాల చేతివృత్తుల వారికి రూ.లక్ష రుణం తక్కువ వడ్డీతో బ్యాంకుల ద్వారా ఇస్తారన్నారు. ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసిన కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నరసాపురంలో వశిష్టగోదావరిపై వంతెన నిర్మాణానికి కేంద్ర మంత్రి శ్రీనివాస్‌వర్మ సహకరించాలని ఎంఎల్ఎ కోరారు. అనంతరం విశ్వకర్మ యోజనలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందించారు. లబ్ధిదారులకు యూనియన్ బ్యాంక్ భీమవరం డివిజన్ నుంచి రూ.2.50 కోట్లు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.2 కోట్లు నమూనా చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి మంగపతి, లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్ర ప్రసాద్, కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, పొత్తూరి రామరాజు, తహశీల్దార్ రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచి కనకదుర్గ, అధికారులు పాల్గొన్నారు. తొలుత స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని డిజిటల్ భవన ఆవరణలో మొక్కలను నాటారు.

గ్రామాల నుంచి శాస్త్రవేత్తలు తయారవ్వాలి

ప్రముఖ అణు శాస్త్రవేత్త ఎఎస్.రావు జయంతి వేడుకలో ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

మారుమూల గ్రామంలో పుట్టిన డాక్టర్ ఎఎస్.రావు ఎలక్ట్రానిక్స్ రంగంలో శాస్త్రవేత్తగా ఎదిగి ఇసిఐఎల్ వ్యవస్థాపకులుగా ఎదిగారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని గ్రామీణ ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు తయారు కావాలని ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. విద్యా ప్రగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని, మేధావుల కృషితోనే దేశంలో ఎన్నో పరిశ్రమలు ముందుకొస్తున్నాయన్నారు. మోగల్లు గ్రామానికి చెందిన ఎలక్ట్రానిక్స్ శాస్త్రవేత్త, ఇసిఐఎల్ వ్యవస్థాపకులు ఎఎస్.రావు 110వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో రూ.5 లక్షల వ్యయంతో మోగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతనంగా ఆటస్థలం ఏర్పాటు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయులు ఎంవి.త్రినాధులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రఘురామకృష్ణంరాజు మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 50 పాఠశాలల్లో ఆటస్థలాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు రెండువేల మంది విద్యార్థులకు అవసరమైన బెంచీలు కూడా సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. పాలకోడేరు ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడలో విద్యార్థులు బాగా తర్ఫీదు పొందుతున్నారని వారిని అభినందించారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల గవర్నింగ్‌బాడీ మెంబర్ సాగి సత్య ప్రతీక్‌వర్మ మాట్లాడుతూ రఘురామకృష్ణంరాజు సూచనలతో పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేశామని చెప్పారు. తన తాత సాగి రామకృష్ణంరాజు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రగతికి నిరంతరం తపించేవారని, ఆయన స్ఫూర్తితో తాము కూడా విద్యాప్రగతికి చేయగలిగినంత వరకు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతియేటా ఎఎస్.రావు జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందించే పరికరాలను ఎంఎల్ఎ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యరూపకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బిహెచ్‌విఎస్.రామకృష్ణంరాజు, ఎస్ఆర్‌కెఆర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సిహెచ్.దిలీప్ చక్రవర్తి, ఎఎస్.రావు జయంత్యుత్సవాల కోఆర్డినేటర్ పివిపి.మూర్తిరాజు, సెక్రటరీ కె.రామరాజు, ఇసిఐఎల్ రిటైర్డ్ డిజిఎం విశ్వనాథ్ జగదీష్, ఇఎస్ఐ రిటైర్డ్ విజిలెన్స్ ఆఫీసర్ కెఎల్.కామేశ్వరరావు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సీనియర్ మేనేజర్ కె.రామభద్రరాజు, డివైఇఒ టివిఎస్ఎన్.నాగరాజు, ఎంఇఒ ఎం.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



ఎఎస్.రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

ఉచిత ఇసుకకు ప్రత్యేక పోర్టల్ ప్రారంభం

జిల్లా వాసులు వినియోగించుకోవాలి - కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



ప్రజలు సులభంగా ఉచిత ఇసుకను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇసుకను ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఆ ఇసుకను కేవలం రవాణా, నిర్వహణ ఛార్జీలను మాత్రమే చెల్లించి ఇంటి వద్దకే దిగుమతి చేసే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఉచితంగా ఇసుకను పొందడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌పోర్టల్ https://www.sand.ap.gov.in నమోదు చేసుకుని రవాణా ఛార్జీలు చెల్లించి ఇసుకను పొందవచ్చన్నారు. వినియోగదారుడు సంబంధిత నిర్మాణ అనుమతులు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా ఇసుక లభ్యతను బట్టి 24 గంటలు బుకింగ్ చేసుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న అనంతరం గనులు, భూగర్భ శాఖ వద్ద నమోదైన వాహనంలో మాత్రమే ఉచిత ఇసుక రవాణాకు అనుమతిస్తారని తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలందరూ సహకరిస్తేనే అభివృద్ధి : కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉండి అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కంకణ బద్ధులై ఉన్నారని, దీనికి ప్రజల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం ఉండి నుంచి పాములపర్రు వెళ్లే కాలువ వద్ద 'స్వచ్ఛతా హి సేవా, ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కొన్ని కాలువలు ఆక్రమణలకు గురికావడం, చెత్త కుప్పలు పేరుకుపోయి ప్రజలకు అనారోగ్యం కలిగిస్తున్నాయన్నారు. ఆకివీడులోని ఉప్పుటేరు వరదలకు శాసనసభ్యులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తీసుకున్న సహాయక చర్యల కారణంగా పరిస్థితి చక్కబడిందన్నారు. ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ అభివృద్ధికి ఆక్రమణలు ఆటంకం కాకూడదనే రెవెన్యూ రికార్డులను అనుసరించి అడ్డంకులను తొలగించడం జరుగుతుందన్నారు. ఆక్రమణల తొలగింపులో దుకాణాలను కోల్పోయిన చిరు వ్యాపారస్తులకు వేరే చోట ఏర్పాటు చేసుకునేందుకు సహకరిస్తున్నట్లు తెలిపారు. కొందరి ఆక్రమణలు మితిమీరాయన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో నేడు పాములపర్రు కాలువ వెంబడి మొక్కలు నాటడం జరిగిందని, ఇదే తరహాలో మరిన్ని మొక్కలను నాటి సుందరీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నేడు ఈ సభ వేదిక నుండి ప్రారంభించడం జరిగిందన్నారు. వంద రోజుల పాలనలో ప్రభుత్వం ప్రజల చేత మంచి ప్రభుత్వం అనిపించుకుంటుందని తెలిపారు. అన్నా క్యాంటీన్ పట్టణాలకు మాత్రమే మంజూరు చేస్తారని, అయినా ఉండిలో ఏర్పాటుకు మంత్రిని ఒప్పించామని, త్వరలో ఉండిలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. తొలుత పాములపర్రు కాలువ వెంబడి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు యడవిల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా బాలలు, మహిళల రక్షణ చట్టాల అమలు

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి - భీమవరం



రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కేశల అప్పారావు

బాలలు, మహిళల సంరక్షణ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కేశల అప్పారావు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేటులో బాలలు, మహిళల సంరక్షణ చట్టాలను కట్టుదిట్టంగా అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం బాల్య వివాహం చేసుకుంటే విధించే శిక్షల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఛైల్డ్ హెల్ప్ లైన్-1098కి వివరాలు తెలపాలన్నారు. విద్యార్థినులు పాఠశాలకు, కళాశాలకు ఒక్కరోజు రాకపోయినా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి ఇళ్లకు వెళ్లి కారణాలను తెలుసుకోవాలన్నారు. భిక్షాటన ముసుగులో గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలు జరుగుతున్నాయని, పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులను సంరక్షించే బాధ్యత వసతిగృహాల అధికారులదేనని, ఎక్కడ ఏ చిన్న తప్పు జరిగినా ఆ ప్రభావం సమాజం పడుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కు కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్, ప్రాంతీయ బాలల సంరక్షణ తనిఖీ అధికారి సిహెచ్.వెంకటపతిరాజు, ఐసిడిఎస్ జిల్లా అధికారి బి.సుజాతారాణి, జిల్లా బాలల సంరక్షణాధికారి ఆర్.రాజేష్, జిల్లా సమగ్ర శిక్షాభియాన్ పిఒ వి.శ్యామ్‌సుందర్, జిల్లా బాలల హక్కుల కమిటీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ పి.వెంకటేశ్వరరావు, సభ్యులు కె.హైమావతి, సిహెచ్.రాజేశ్వరరావు, క్రాఫ్ సంస్థ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, సిడిపిఒ సూపర్‌వైజర్లు, పోలీసులు, సచివాలయ పోలీసులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదిలోగా ఎర్ర కాలువ గండ్లు పూడుస్తాం : ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎర్ర కాలువకు పడిన గండ్లను ఏడాదిలోగా పూడుస్తామని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి పొనుకుమారి శేషులత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎర్రకాలువ కారణంగా నియోజకవర్గంలోని రెండు మండలాల్లో 14 వేల ఎకరాలు ముంపునకు గురైందన్నారు. ఎర్రకాలువ రాబోయే కాలంలో మరో బుడమేరుగా మారనుంద ప్రచురించినట్లు తెలిపారు. ఇప్పటికే అధికారులు గండ్లు పూడ్చేందుకు ప్రణాళిక చేయాల్సి ఉందన్నారు. రాబోయే సమావేశానికి ఎర్రకాలువకు సంబంధించిన అధికారులను రప్పించాలని ఎంపిడిఒ విశ్వనాథంకు ఆయన ఆదేశించారు. ఎర్రకాలువ ముంపు నివారణ రహదారుల నిర్మాణాలను తీసుకొని ప్రణాళిక బద్ధంగా రాబోయే ఐదేళ్లలో పూర్తి చేయాల్సి ఉందన్నారు. సర్పంచులు మూడున్నర ఏళ్ల పాలనలో ఏమీ చేయలేకపోయారని తెలిపారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో తమకలను సహకారం చేసుకోవాలన్నారు. మూడు నెలల కాలంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు తీసుకొచ్చి సర్పంచుల గౌరవాన్ని నిలిపిన ఘనత పవన్ కళ్యాణ్‌కే దక్కుతుందన్నారు. ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ సర్పంచులు అధికారులతో ముఖాముఖి అయి తమ గ్రామంలోని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపిపిలు ఎస్.రామకృష్ణ, కట్టా రంగబాబు, ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర సమావేశాలు వాయిదా

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 22 నుంచి నరసాపురంలో జరగాల్సిన సిపిఎం రాష్ట్ర సమావేశాలను వాయిదా వేసినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. ఇటీవల సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లా ఉద్యమ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మృతి నేపథ్యంలో ఈ సమావేశాలను వాయిదా వేసినట్లు చెప్పారు. సమావేశాలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

సిపిఎం అభిమాని చింతపల్లి మాణిక్యాలరావు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర



మాణిక్యాలరావు (ఫైల్‌ఫొటో)

మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన సిపిఎం అభిమాని చింతపల్లి మాణిక్యాలరావు (80) అనారోగ్యంతో గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన ఆర్అండ్‌బి శాఖలో డిఇగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. పొలమూరులో జన్మించిన మాణిక్యాలరావు ఉద్యోగ విరమణ అనంతరం రాజమండ్రిలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు చింతపల్లి శ్రీనివాసరావు జెవివి, అభ్యుదయ ఉద్యమాల్లో జిల్లాస్థాయిలో చురుగ్గా పని చేస్తూ కరోనా కాలంలో మృతి చెందారు. మాణిక్యాలరావు అన్నదమ్ములు సుదీర్ఘకాలం సిపిఎం సభ్యులుగా పని చేశారు. మాణిక్యాలరావు ప్రజా ఉద్యమాలకు అండగా ఉంటూ ఎల్లప్పుడూ సిపిఎం అభిమానిగా ఉండేవారు. మాణిక్యాలరావు కుటుంబం సైతం సిపిఎం అభిమానులుగా ఉండటం విశేషం. మాణిక్యాలరావు మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, సిపిఎం మండల కార్యదర్శి సుబ్బరాజు, సిపిఎం పొలమూరు గ్రామ శాఖ, పలువురు నేతలు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉపరితల ద్రోణి ప్రభావంతో పాలకొల్లులో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మబ్బులతో వాతావరణం ఉన్నా మధ్యాహ్నం ఎండ కాసింది. అయితే సాయంత్రం ఐదు గంటల నుంచి వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా ఆటంకం ఏర్పడింది. వర్షం వల్ల ఇంటికి చేరుకునే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

ఆచంట: శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. 15 రోజుల నుంచి విపరీతమైన ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలకు శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో సేదతీరారు. వర్షం కారణంగా డ్రెయిన్లలో నీరు రోడ్లపైకి చేరింది. ఈదురుగాలులు వీయడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



ఆచంట: రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

ఏచూరి, ఆర్ఎస్ మృతి కార్మికవర్గానికి తీరనిలోటు

ప్రజాశక్తి - భీమవరం



ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

సీతారాం ఏచూరి, ఆర్ఎస్ మృతి కార్మికవర్గానికి తీరని లోటని సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంతరావు అన్నారు. స్థానిక 38వ వార్డు లంకపేటలో ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైకుంతరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు, అటవీ హక్కు వంటి చట్టాల రూపకల్పనలో సీతారాం ఏచూరి ప్రముఖపాత్ర పోషించారన్నారు. 39వ వార్డు మాజీ కౌన్సిలర్ బోడసింగ్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఏచూరి, ఆర్ఎస్ మృతి ఉద్యమానికి, బడుగు బలహీన వర్గాలకు, కార్మికవర్గానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి సాయమ్మ, కుమారి, ఏసు, మరియమ్మ, లక్ష్మి, రూప పాల్గొన్నారు.


ఏలూరుపాడులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

ఏలూరుపాడులో పలు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు శుక్రవారం ప్రారంభించారు. ఏలూరుపాడు గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన భవనాన్ని రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. ఎంపీ నిధులు రూ. 8 లక్షలతో నిర్మించిన నూతన వంతెన, పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన వంతెనను, రూ.11.50 లక్షలతో నిర్మించిన పంచాయతీ మార్కెట్ షెడ్లను ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపతిరాజు వెంకట జగ్గరాజు, ఎంపిటిసి చిన్నావర్వు రాంబాబు, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయులు, ఇఒ ఆర్డి ఎవి.భాస్కరరావు, గ్రామ కార్యదర్శి ఎస్.అరుణాదేవి, సచివాలయ కార్యదర్శి నాగ మోహిని పాల్గొన్నారు.

ప్రోటోకాల్ బాధ్యత అధికార పార్టీదే

మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ

ప్రజాశక్తి - నరసాపురం

అన్నా క్యాంటీన్ ప్రారంభ సమయంలో ప్రోటోకాల్ చూసుకోవాల్సిన బాధ్యత అధికార పార్టీదని, ఆ తప్పిదాన్ని తమపై రుద్దడం విడ్డూరంగా ఉందని వైసిపి మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ కౌంటర్ ఇచ్చారు. విసి నాని, కౌన్సిలర్ బొంతు రాజశేఖర్, మాజీ విసి షేక్ బుజ్జిమున్సాతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఎంఎల్ఎ నాయకర్ భాష కౌన్సిలర్లను కించపరిచే విధంగా ఉందని విమర్శించారు. తాము కూడా ప్రజల చేత ఎన్నుకోబడ్డామని, ఇంకా తాము పదవుల్లో ఉన్న విషయాన్ని ఎంఎల్ఎ గుర్తించాలని తెలిపారు. పదవుల్లో ఉన్నందున్న అధికారులు తమకు ప్రోటోకాల్ పాటిస్తారని, దాన్ని తప్పుపట్టి వైసిపి ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలను చించడం సరికాదని తెలిపారు. మాజీ విసి షేక్ బుజ్జిమున్సా మాట్లాడుతూ వైసిపి వాళ్లు ఒళ్లు దగ్గర పెట్టుకోకపోతే తోలు తీస్తామని ఎంఎల్ఎ పదే పదే ప్రస్తావించడం బాధాకరమన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఉన్న తమ పార్టీ వాళ్లకు నిబంధనల ప్రకారం ప్రోటోకాల్ ఇవ్వాల్సిందే అన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి - గణపవరం

ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గణపవరం పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్‌బాబు అన్నారు. వరదరాజపురంలో శుక్రవారం నిర్వహించిన మీకు తెలుసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా కలిసి మెలిసి జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుడ్ ల్యాంప్ ప్రాజెక్టు బెట్ రీచ్ కార్యకర్త పి.సాగర్, (తాడేపల్లిగూడెం) వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట ఎవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రం (బోటనీ)లో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శ్రీదేవి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు గడువు ఉందన్నారు. అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. గరిష్టంగా నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తామని తెలిపారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సిహెచ్ అగ్రహారం గ్రామ సర్పంచి చుక్కా అప్పారావు అన్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేసి, క్లోరినేషన్ చేసిన తాగునీటిని అందిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య సహాయకులు నామాల రాజు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం వల్ల దోమలను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

దిగమర్రు విఆర్ఒ రాజు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

మండలంలోని దిగమర్రు విఆర్ఒ బల్ల రాజు (45) శుక్రవారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఆయన స్వగ్రామం పోడూరు మండలం వేడంగి. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆయన మృతదేహాన్ని పోడూరు, పాలకొల్లు మండలంలోని విఆర్ఒ సంఘం సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. పాలకొల్లు తహశీల్దార్ యద్దు దుర్గా కిషోర్, సిబ్బంది ఆయన మృతికి సంతాపం తెలిపారు.

భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరుపై హర్షం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

త్వరలో నిర్మించనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడంపై అల్లూరి సీతారామరాజు యువజన సమాఖ్య, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ సందర్భంగా నరసయ్య అగ్రహారంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద యువజన సమాఖ్య ఆధ్వర్యంలో హర్షం ప్రకటిస్తూ అల్లూరికి ఘన నివాళులర్పించారు. సమాఖ్య అధ్యక్షులు కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారిని గడగడలాడించిన విప్లవ వీరుడన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి నామకరణం చేయడం భారతీయులంతా గర్వించదగ్గ విషయమన్నారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, ఎస్.సూర్యనారాయణ రాజు, అల్లూరి అభిమాన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యాన విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉండి

విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి స్థితిలో స్థిరపడాలని లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివ రామరాజు అన్నారు. శుక్రవారం ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్, లయన్ సాగిరాజు సాంబ శివరాజు నివాసం వద్ద వాడపల్లి అభినయ వర్షక చదువు నిమిత్తం రూ.58 వేల ఆర్థిక సాయం అందజేశారు. లయన్ సూర్యకుమారి, లయన్ సాంబ శివరాజు, వేగేశ్న మహేష్, నీలిమ, పెన్మెత్స దిలీప్, సింధు, వేగేశ్న అనంతలక్ష్మి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, ఉపాధ్యాయులు గాదిరాజు రంగరాజు మాట్లాడారు. దాత సాగిరాజు సాంబశివరాజు సేవా కార్యక్రమాలు చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు సుబ్బరాజు, భూపతిరాజు హరనాథ్ రాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, సీతారామరాజు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతంలోని శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని సిపిఎం గ్రామ కార్యదర్శి కప్పల రత్నరాజు తెలిపారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో సిద్ధాంతంలోని 8వ వార్డు సభ్యులు ఆకుల వీర్రాజు, పలువురు గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యాన శ్మశానవాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నరాజు మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా సిద్ధాంతం శ్మశాన వాటిక అభివృద్ధి నోచుకోకుండా నిర్లక్ష్యానికి గురైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో శ్మశానవాటిక అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయిందన్నారు. ప్రస్తుతం అది డంపింగ్ యార్డుగా తయారైందన్నారు. అంత్యక్రియల సమయంలో కనీసం అక్కడ నిలుచునే పరిస్థితి కూడా లేకుండా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రజాప్రతినిధులు శ్మశానవాటికను అభివృద్ధి చేయాలన్నారు.

రైల్వే భద్రతా దళాల సేవలు అమోఘం

ప్రజాశక్తి - భీమవరంటౌన్

ప్రయాణికుల రక్షణ, భద్రతలో రైల్వే భద్రతా దళాలు చిత్తశుద్ధితో పని చేస్తాయని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఆర్‌పిఎఫ్ సిఐ షేక్ దాస్తగిరి అన్నారు. శుక్రవారం రైల్వే భద్రతా దళ వ్యవస్థాపక దినోత్సవాన్ని శ్రీవిజ్ఞానవేదిక, టౌన్ ఆర్‌పిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానం చేరే వరకూ వారి వద్ద ఉన్న విలువైన వస్తువులను దొంగాల బారి నుంచి రక్షణ కల్పించడంతోపాటు, కదులుతున్న రైలు ఎక్కే సమయంలో ప్రమాదాలకు గురయ్యే ప్రయాణికుల ఎందరి ప్రాణాలో కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ ఎస్.వెంకటేశ్వర్లు, కె.రఘురామయ్య మాట్లాడుతూ మన డివిజన్‌లో 135 కిలో మీటర్ల పరిధిలో నిడదవోలు - నరసాపురం - విజయవాడ ఆర్‌పిఎఫ్ దళాలు పని చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వ 24 సర్వీసుల్లో తమది ఒకటి అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, డిఎన్ఆర్ కళాశాల మేజర్ ఎ.వీరయ్య, కెప్టెన్ చంద్రశేఖర్ మాట్లాడారు.



ఆపిఎఫ్ సిబ్బందిని సత్కరిస్తున్న సభ్యులు

మార్టేరు వరి పరిశోధనా స్థానంలో అంతర్జాతీయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు ఆచార్య ఎన్‌జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని అంతర్జాతీయ వరి పరిశోధనా స్థానం, మనీలా, బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం (గుంటూరు) పరిశోధనా సంచాలకులు డాక్టర్ పివి.సత్యనారాయణ, సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. ముందుగా సత్యనారాయణ మాట్లాడారు. ఈ పరిశోధనా స్థానం నుంచి మొట్ట మొదట దోమను తట్టుకునే రకం వజ్రం, మొట్ట మొదటి సంకర వరి రకాలను రూపొందించామని తెలిపారు. దేశంలోనే ముఖ్య మెగా వరి రకాలు స్వర్ణ, విజేత, కాటన్ దొర సన్నాలను ఈ పరిశోధనా స్థానం విడుదల చేసిందని తెలిపారు. ఈ మధ్యకాలంలో విడుదలైన ఎంటియు 1318 రకం రైతుల ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తున్నారని తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సన్న గింజ కలిగి, అధిక మిల్లింగ్ శాతం, తక్కువ వేయి గింజల బరువు కలిగిన సన్న రకాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున అటువంటి రకాల రూపకల్పనకు మార్టేరు పరిశోధనా స్థానం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం ఆచంటలో సాగుచేస్తున్న ఆర్‌జిఎల్ 7034, 7039 రకాలను సందర్శించారు. కార్యక్రమమంలో బిఎంజిఎఫ్ శాస్త్రవేత్తలు గారీ అట్లిన్, శ్రీవల్లి కృష్ణన్, కిశోర్‌రావు, అంతర్జాతీయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


వరిని పరిశీలిస్తున్న అంతర్జాతీయ శాస్త్రవేత్తలు

ఎఎంసిలోనే రైతు సేవా కేంద్రం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఉండి

రైతులకు సేవలందించే రైతు సేవా కేంద్రం, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ఒకే చోట ఉంటేనే రైతులకు పూర్తిస్థాయిలో సేవలందించగలుగుతామని ఎంఎల్ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి రఘురామకృష్ణంరాజు ఎఎంసిని పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ఎఎంసిలోనే రైతు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఇబ్బందులు ఉండవని, కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయడానికి కావాల్సిన అన్ని రకాల పరీక్షలూ చేసిన అనంతరం ఎఎంసి ప్రాంగణంలోని ధాన్యాన్ని నిల్వ ఉంచడానికి ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. రైతులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు విశాలమైన షెడ్లు ఉండడం అదనపు అంశమని తెలిపారు. వారం రోజుల్లో రైతు సేవా కేంద్రాన్ని ఎఎంసిలోకి మార్చిన అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న రైతు భరోసా కేంద్రంలోకి గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా పోలీస్ స్టేషన్లను అందులోకి తీసుకురావాలనే ఉద్దేశం తమకు ఉందన్నారు. ఎంఎల్ఎ వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ త్వరగా పూర్తిచేసి ఈ ప్రాంతవాసులకు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నరసాపురంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కౌరు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, నరసాపురం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ నరసాపురం - కోటిపల్లి రైల్వేలైన్ బాగా ఆలస్యమవుతోందన్నారు. వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణం చేపట్టి గోదావరి జిల్లాల ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చాలని కోరారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలన్నారు. కవురు పెద్దిరాజు మాట్లాడుతూ తీరప్రాంత ప్రజల, మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. వేట నిషేధ సమయంలో నష్టపరిహారాన్ని వెంటనే అందించి ఆదుకోవాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశానికి తెలగంశెట్టి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పొగాకు నారాయణ రావు, కె.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, నోముల కొండ, బి.జోగేశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యార్థుల సాయం


ఎంఎల్ఎకు చెక్కు అందజేస్తున్న జ్ఞానానంద విద్యా సంస్థ యజమాన్యం, విద్యార్థులు

ప్రజాశక్తి - కాళ్ల

వరద బీభత్సంలో అతలాకుతలమైన బెజవాడ ప్రజలకు తామున్నామంటూ జ్ఞానానంద విద్యా సంస్థల విద్యార్థులు ముందుకొచ్చి సాయం చేయడం అభినందనీయమని ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఏలూరుపాడు జ్ఞానానంద విద్యా సంస్థ యజమాన్యం, విద్యార్థులు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎంఎల్ఎ కనుమూరు రఘు రామకృష్ణంరాజుకు చెక్కు అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయం నిమిత్తం జ్ఞానానంద విద్యా సంస్థలు, ఏలూరుపాడు విద్యార్థులు రూ.2,74,813 విరాళం సేకరించారు. ఆ మొత్తంలో ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుకు రూ.1,26,999లను పాఠశాల కరస్పాండెంట్ దాట్ల జయ సీతారామ శ్రీనివాసవర్మ డీడీ రూపంలో అందజేశారు. నిధి సేకరణలో ఉత్సాహంగా పాల్గొని అత్యధిక ఫండ్ సేకరించిన విద్యార్థులను ఎంఎల్ఎ మెడల్స్‌తో సత్కరించి అభినందించారు. శనివారం సిఎం సహాయ నిధికి సేకరించిన ఫండ్ నుంచి జిల్లా కలెక్టర్‌కు చెక్కు రూపంలో రూ.77,814, డిఇఒకు రూ. 40,000, కాళ్ల ఎంఇఒకు రూ.30,000 పాఠశాల యాజమాన్యం, స్టాఫ్, విద్యార్థులు అందజేయనున్నారు. తోటివారికి సహాయపడే ధృక్పథం విద్యార్థుల్లో నింపి, వారి ద్వారా సహాయం చేయించాలనే ఆలోచనతో స్కూల్ డైరెక్టర్ దాట్ల విజయ కుమారి, స్కూల్ ప్రిన్సిపల్ మంతెన త్రిమూర్తిరాజు, ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించగా తల్లిదండ్రులు కూడా సహాయ సహకారాలు అందించడాన్ని అభినందించారు.

భీమవరం : వరద బాధితుల సహాయానికి తామున్నామంటూ ముందుకొచ్చిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య అధ్యక్షులు, సభ్యులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య అధ్యక్షులు, సభ్యులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి రూ.25,616 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వరద బాధితుల పట్ల ఔదార్యం ప్రకటిస్తూ జిల్లా ప్రజలు స్పందించిన తీరు ముదావహమన్నారు. అలాగే నేడు చెక్కును అందజేసిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య ఎంతో ప్రత్యేకం అన్నారు. చెక్కును అందజేసిన వారిలో సమాఖ్య ఫౌండర్ అండ్ ఛైర్మన్ సోడదాసి గంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గుడిసె అనిల్‌కుమార్, కోశాధికారి గుర్రం వెంకట రత్నం, నియోజకవర్గ కార్యదర్శి కొండ రాజేష్‌కుమార్, ఉపాధ్యక్షులు కుతాడి నరసింహమూర్తి, లక్కాకుల అశోక్, బంధీలా జార్జ్, లింగంపల్లి మనోహర్, టి.ప్రసన్న కుమార్, తాళ్లూరి రాజ్ కుమార్, బంటుమిల్లి జేమ్స్ ఉన్నారు.

నరసాపురం: నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. విజయవాడలోని వరద ముంపు ప్రాంతం సింగ్‌నగర్‌లో దుప్పట్లు, నైటీలు, పిల్లలకు డ్రెస్సులు పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బొమ్మిడి సూర్య కుమారి, ట్రెజరరీ ఆత్మురి రమా, విజయ్ కుమార్, సునీల్, వెంకట్, పివి.ప్రసాద్ పాల్గొన్నారు.

పెనుమంట్ర : విజయవాడ వరద బాధితుల కోసం విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు రూ.25 వేల విరాళం సేకరించారు. విద్యార్థులు సేకరించిన మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ఖాతాకు పంపుతూ డీడీని స్కూల్ కార్యదర్శి, కరస్పాండెంట్ తేతలి సంజీవరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ అకాడమిక్ ప్రిన్సిపల్ హెలెన్, రామ్ రెడ్డి, శకుంతల, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, కల్పన, యశస్విని పాల్గొన్నారు.


కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న బహుజన సమాఖ్య సభ్యులు

సంక్షోభంలో కూడా సంక్షేమం అందిస్తున్నాం

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వైసిపి పాలనంతా అరాచకమేనని, కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక హామీలు అమలు చేశామని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరం 6వ వార్డు తాడిమళ్ల లక్ష్మి నరసమాంబ పురపాలక ప్రత్యేక పాఠశాలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ అన్నదాతకు అండగా నిలబడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజానీకానికి ఉపయోగపడేలా పని చేస్తామన్నారు. ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకులు మోడీ, చంద్రబాబు, పవన్ అన్నారు. గత ప్రభుత్వం 20 ఏళ్ల అయినా అప్పు తీర్చలేని సంక్షోభంలోకి నెట్టేసిందని విమర్శించారు. అనంతరం 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను విడుదల చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తణుకు: సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం కూటమి ప్రభుత్వ పాలనకు వంద రోజులు పూర్తయిన సందర్భంగా తణుకు పట్టణం 3వ, 4వ వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో 100 రోజుల్లో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేశారు. దోచుకో, దాచుకో అనేలా రాష్ట్రంలో జగన్, తణుకులో కారుమూరి ఐదేళ్ల పరిపాలన సాగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటకృష్ణ, దొమ్మేటి వెంకటసుధాకర్, రామకృష్ణ, కడియాల సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ పాల్గొన్నారు.


తణుకు : మాట్లాడుతున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

ఆచంట : ఆచంట పంచాయతీ వద్ద కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజావేదికపై ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సర్పంచి కోట సరోజినీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వంగా రాబోయే రోజుల్లో మరింత పేరు తెచ్చుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కేతా మీరయ్య, తమ్మినీడి ప్రసాద్, బీరా నరసింహమూర్తి, జవ్వాది బాలాజీ పాల్గొన్నారు.

పాలకొల్లు : ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు పూలపల్లి రంగరాజు రైస్ మిల్లు నుంచి రైతులతో కలిసి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొనున్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని మంత్రి భారీగా నిర్వహిస్తున్నారు.

సీతారామపురం హైస్కూల్లో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారామపురం హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, ల్యాబ్‌లను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలను, పరిసరాలను ఆమె పరిశీలించారు. వంట పదార్థాల స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో భోజనం చేసి ఆహార పదార్థాలను రుచి చూశారు. భోజనం సమయానికి పెడుతున్నారా, బాగుంటుందా అని కలెక్టర్ విద్యార్థులను ఆరా తీశారు. తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారు, అర్థమవుతుందా అని అడిగి, కొన్ని ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. బాగా చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం ఎల్‌బి చర్లలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల కళాశాల, ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాగునీటి సమస్య ఉందని కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు కలెక్టరుకు చెప్పారు. దీనిపై ఆమె వెంటనే స్పందించి ఒక ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం, బోర్ వెల్ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దారు తలారి రాజరాజేశ్వరి, కళాశాల ప్రిన్సిపల్ మానేపల్లి రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ పి.మార్క్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

డిఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం

వైన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎస్‌పి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మాదకద్రవ్యాలు హాని కలిగించే పదార్థాలన్నారు. యువతరాన్ని దారి మళ్లించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దుర అలవాట్లలో మాదకద్రవ్యాల వినియోగం ఒకటన్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువు వదిలి సర్వస్వం కోల్పోయి భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారన్నారు. ఎవరైనా వీటిని అమ్మినా వినియోగించినా తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, సిఐ బి.యాదగిరి, కళాశాల డీన్ గంధం శ్రీరామ్ కృష్ణ, పీజీ అసిస్టెంట్ డైరెక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం : పితాని

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఎంఎల్ఎ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెనుగొండ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో గ్రామస్తులు ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎమాట్లాడారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మల్లు లక్ష్మీనారాయణ, జడ్‌పిటిసి కోడూరు గోవర్ధన్, బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పారిశుధ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని క్షీరా రామ లింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో పారిశుధ్య వారోత్సవాలు 4వ రోజు శుక్రవారం కొనసాగాయి. దేవాదాయ శాఖ కమిషనర్, గొల్లపూడి, విజయవాడ వారి ఆదేశాలు ప్రకారం ఈ నెల 17 నుంచి వారోత్సవాలు జరుగుతున్నాయి. నాలుగో రోజు ఇఓ ముచ్చర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ గోశాల వద్ద శుభ్రం చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పంచాయతీల విస్తరణాధికారి మేడిది నవీన్ కిరణ్ సూచించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 17 పంచాయతీల్లో పంచాయతీ పాలకవర్గ సభ్యులు సిబ్బంది మొక్కలు నాటారన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాతావరణ సమతుల్యానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గణపవరం : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక డిగ్రీ కాలేజీ విద్యార్థులు మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సోషల్ వర్క్ అధ్యాపకులు జి.వెంకటరమణ, వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

'ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా జీవనానికి అవరోధం'

ఆచంట: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత అధికార పీఠంపై కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఇటీవల కాలంలో తీసుకుంటున్న నిర్ణయాలు సామాన్య ప్రజల జీవనానికి అవరోధాలుగా నిలుస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. శుక్రవారం పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లబత్తుల గాంధీ సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణ రాజు చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో గోపాలన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, కొప్పర్తి నరసింహమూర్తి, కలిశెట్టి సింహాచలం, కిలారి సాంబమూర్తి, వి.నాగేశ్వరరావు, ఎం.సన్యాసిరావు, దాడి గౌరమ్మ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.